నేడు రైతు భరోసా నిధులు పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురం

రైతుభరోసా పథకం కింద జిల్లాలో 145954 మంది రైతులకు రూ.59.720 కోట్లు మంజూరయ్యాయి. 2023-24 సంవత్సరానికి గానూ రైతు భరోసా- పిఎం కిసాన్ ఐదో సంవత్సరం రెండో విడత నిధులను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మంగళవారం రైతుల ఖాతాల్లో నేరుగా జమచేస్తారు. జిల్లాలో 1,23,599 మంది రైతులకు రూ.50.646 కోట్లు, 18803 మంది ఆర్ఓఎఫ్ఆర్ రైతులకు రూ.7.567 కోట్లు, 3552 మంది కౌలు రైతులకు రూ.1.507 కోట్లు పంపిణీ చేయనున్నారు.

గృహనిర్మాణాల పేరుతో వాణిజ్య సముదాయాలు

- నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు నిల్
- అతీగతీ లేని టౌన్ ప్లానింగ్ కార్యాలయం
- ఏడాదిగా టిపిఒ పోస్టు ఖాళీ
- దళారులదే హవా

కొంకివీధిలో అక్రమంగా నిర్మాణమవుతున్న వాణిజ్య సముదాయం

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీ లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు సాగిపోతున్న పరిస్థితి నెలకొంది. పట్టించుకునే నాథుడు లేకపోవడంతో పట్టణ ప్రణాళిక విభాగం గాడి తప్పింది. ఏడాదికి పైగా టిపిఒ పోస్ట్ ఖాళీగా ఉంది. ఇక్కడికి పని చేయడానికి అధికారులు ముందుకు రావడం లేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా అభివృద్ధి చెందిన పట్టణాలు, నగరాల్లో పని చేస్తున్న అధికారులు ఇక్కడ పని చేయడానికి పెద్దగా ఆసక్తి చూపడం లేదు. పట్టణంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఇప్పుడిప్పుడే మొగ్గతొడిగిన దశలో ఉంది. మిగిలిన మున్సిపాలిటీల్లో నాలుగు రాళ్లు వెనకేసుకోడానికి అలవాటు పడిన టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ మున్సిపాలిటీలో పని చేయడానికి ముందుకు రావడం లేదు. గతంలో విశాఖ జివిఎంసిలో పని చేసిన టౌన్ ప్లానింగ్ అధికారి కొద్దినెలల్లో బదిలీ చేయించుకుని వెళ్లి పోయారు. ఆ తర్వాత నుంచి ఇక్కడికి ఎవరూ రావడం లేదు. బొబ్బిలి మున్సిపాలిటీ టిపిఒకు కొన్నాళ్ల క్రితం ఇక్కడ టిపిఒగా ఇంఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన కనీసం వారం రోజులు కూడా ఇక్కడికి రాకుండానే ముఖం చాటేశారు. ఆయనకు ప్రస్తుత మున్సిపల్ కమిషనర్ టి.జయరాం నోటీసు జారీ చేశారు. ఇన్‌ఛార్జి టిపిఒ గా వారంలో మూడు రోజులు ఈ మున్సిపాలిటీలో విధులు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. అయినా ఆయన బేఖాతరు చేశారు. టౌన్ ప్లానింగ్ అధికారి లేకపోవడంతో ఆ విభాగంలో ఎవరికి వారే యమునా తీరు అన్న చందంగా తయారైంది. దీంతో కొంతమంది అక్రమ నిర్మాణాలు సాగిస్తున్న వ్యాపారులు దళారులను ఆశ్రయిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణదారులకు నోటీసులు జారీ చేసిన తర్వాత మార్గదర్శకాల ప్రకారం అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. పలుకుబడి, డబ్బులు ఉన్న వారికి నామమాత్రంగా నోటీసు జారీ చేసినట్లు చూపిస్తూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

గృహ నిర్మాణాల ముసుగులో వాణిజ్య సముదాయాలు

పట్టణంలో చాలా ప్రాంతాల్లో కొంతమంది నిర్మాణదారులు గృహ నిర్మాణం కోసమని దరఖాస్తు చేస్తున్నారు. క్రమేణా వాటిని వాణిజ్య సముదాయాలుగా మారుస్తున్నారు. ఇలాంటి నిర్మాణాల విషయంలో అధికారులు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని మున్సిపాలిటీకి అపరాధ రుసుం రూపంలో ఆదాయాన్ని రాబట్టాల్సి వుంది. కానీ అధికారులు ఎక్కడా ఆ విధంగా వ్యవహరించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని కొంకివీధిలో మెయిన్ రోడ్‌లో వ్యాపారి రవ్వా సతీష్ భవన నిర్మాణం చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ భవన నిర్మాణం వుందనే టౌన్ ప్లానింగ్ సిబ్బంది, దాని యజమాని సతీష్‌కు నోటీసు జారీ చేసినట్లు తెలుస్తోంది. అయితే తనకు ఏవిధమైన నోటీసులు అందలేదని ఆయన చెపుతున్నారు. దీనిపై సంబంధించిన సచివాలయ సిబ్బందికి అడగ్గా వారు కూడా సరైన వివరణ ఇవ్వలేకపోతున్నారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇరుకు సందులో వాణిజ్య సముదాయం నిర్మాణం జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. పట్టణంలో అనేక చోట్ల ఇలాంటి అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. కానీ టౌన్ ప్లానింగ్ అధికారి లేకపోవడంతో ఆ విభాగంలో జరుగుతున్న వ్యవహారాలన్నీ దళారీల కనుసన్నల్లో జరుగుతున్నట్లు తెలుస్తోంది.

టిపిఒ నియమించాలని లేఖలు రాశా : టి.జయరాం, కమిషనర్

టౌన్ ప్లానింగ్ అధికారిని నియమించాలని కోరుతూ మున్సిపల్ ఉన్నతాధికారులకు రెండు లేఖలు రాశా. నేను విధుల్లో చేరి 40రోజులే అయింది. టౌన్ ప్లానింగ్‌పై ఇంకా పూర్తి స్థాయిలో దృష్టి సారించలేదు. నా దృష్టికి వచ్చిన ఫిర్యాదులపై విచారించి చర్యలు తీసుకుంటాను.

ఏజెన్సీని కరువు ప్రాంతంగా ప్రకటించాలి

కలెక్టర్, జెసికి సిపిఎం, ఎపి రైతు సంఘం వినతులు

ప్రజాశక్తి- పార్వతీపురం

జిల్లాలో పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని, మిగిలిన 12 మండలాల్లో పంట నష్టపోయిన ప్రతి పంచాయతీనీ కరువుగా ప్రకటించాలని సిపిఎం నాయకులు జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావుకు సోమవారం వినతిని అందజేశారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ ఇటీవల సిపిఎం బృందం పార్వతీపురం మండలంలోని పలు గ్రామాల్లో ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించిందన్నారు. వర్షాభావంతో ఎండిపోయిన వరిని పొట్టదశకు వచ్చిన పంట మొత్తం పూర్తిగా నీరులేక ఎండిపోయిందన్నారు. ఈ ప్రాంతంలో వర్షాధారంతో వరి నాట్లు వేయడం తప్ప కాలువ సౌకర్యం లేదని, దీంతో మండలంలో సుమారు 70శాతం వరి నాట్లు పంట దశకు వచ్చి దెబ్బ తిన్నాయని, తీవ్రంగా నష్టపోయామని రైతులు తమ వద్ద వాపోయారని తెలిపారు. అలాగే గుమ్మ లక్ష్మీపురం, కురుపాం మండలాలోని తమ పర్యటనలో 90శాతం భూమిలో వరి నాట్లు పడలేదని, నాట్లు వేసినవి కూడా వర్షాలు పడక పంటలు పూర్తిగా ఎండిపోయి తీవ్ర కరువుకు గురయ్యాయని అన్నారు. కావున ఈ మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే భామిని, సీతంపేట, వీరఘట్టం, పాలకొండ, సీతానగరం, గరుగుబిల్లి, కొమరాడ, సాలూరు, బలిజిపేట తదితర మండలాల్లో పంచాయతీ స్థాయిలో వర్షాభావంతో వరి నాటుమల్లు దెబ్బతిన్నాయని, కావున పంచాయతీల వారి కరువు ప్రాంతాలుగా ప్రభు త్వం ప్రకటించి రైతులకు పంట నష్ట పరిహారం చెల్లించాలని, ప్రత్యామ్నాయ పంటలకు ప్రభుత్వం ఏర్పాటు చేయాలని. జిల్లాలో సాగునీటి సౌకర్యం పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, జంఝావతి పూర్తి చేయాలని, ఏజెన్సీ ప్రాంతంలో మినీ రిజర్వాయర్లు, చెక్ డ్యాములు నిర్మించి, సాగునీటి వనరులకు నిధులు కేటాయించాలని డిమాండ్ డిమాండ్



జెసికి వినతిని అందజేస్తున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి

చేశారు. అలాగే పై ప్రాంతాలను కరువు మండలాలుగా ప్రకటించే వరకు సిపిఎం పోరాడుతుందని, జిల్లా రైతులంతా ఆందోళన పోరాటం చేపట్టాలని వేణు పిలుపునిచ్చారు. వినతిని అందజేసిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు వి.ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు కె.రామస్వామి, జి.వెంకటరమణ, బి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం వినతి

జిల్లాలో వర్షాలు సకాలంలో పడకపోవడంతో వరి పంటకు పూర్తిగా నష్టం వాటిల్లిందని, కావును జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, బంటు దాసు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాభావంతో కాలువల చివర, వర్షాధార భూముల్లో వరి పూర్తిగా దెబ్బతిందన్నారు. కొమరాడ మండలంలో పత్తి కూడా పోయిందని, ఇప్పటివరకు వ్యవసాయ శాఖ అధికారులు ఎలాంటి సర్వే చేయలేదన్నారు. ఇప్పటికైనా నష్టపోయిన పంట భూములను సర్వే చేసి రైతులకు నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్, జెసిలను కోరారు.

దళితు భూములను దళితులకే అప్పజెప్పాలి

గరుగుబిల్లి మండలం శివాం గ్రామ దళితులకు వారి భూములను వారికే అప్పజెప్పాలని కలెక్టర్‌కు మరో వినతి పత్రాన్ని అందించారు. 1970లో శివం గ్రామ దళితులకు ప్రభుత్వ భూముల్లో డి పట్టాలిచ్చారన్నారు. తరువాత భూస్వాములు అధికారుల అండతో దళితుల భూములను ఆక్రమించుకొని సాగు చేస్తున్నారని వాటిని వెంటనే భూ సర్వే చేసి దళితులకు ఆ భూములను అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివం దళితులు, రైతు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతి

గుమ్మలక్ష్మీపురం : మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ జె.రాములమ్మకు సిపిఎం నాయకులు సోమవారం వినతిని అందించారు. సకాలంలో వర్షాల్లేక 50 శాతం మాత్రమే వరి నాట్లు పడ్డాయని, అయినా వర్షాలు కురవక పోవడంతో వేసిన పంట పూర్తిగా ఎండిపోయిందని అన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కోలక అవినాష్, జిల్లా కమిటీ సభ్యులు మండంగి రమణ, నాయకులు బిడ్డిక శంకరరావు, సన్యాసిరావు, సర్పంచి బి.రాజారావు ఉన్నారు.

పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్‌పి విక్రాంత్‌పాటిల్

గిరిశిఖర గ్రామాలను సందర్శించిన ఎస్‌పి

ప్రజాశక్తి- పాచిపెంట

మండలంలోని గిరి శిఖర గ్రామాలు బొర్రమామిడి, చిట్టేలబ, కన్నయ్యవలస గ్రామాలను ఎస్‌పి విక్రాంత్ పాటిల్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు రహదారి రవాణా సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం పాచిపెంట పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. పి.కోనవలస చెక్ పోస్ట్ వద్దా అంతర్ రాష్ట్ర వాహనాల తనిఖీలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట సిఐ ధనుంజయ్‌రావు. ఎస్ఐ ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

సాలూరు: సాలూరు, మక్కువ రోడ్డులో నిర్మాణమైన నూతన పోలీసు స్టేషన్ భవనాన్ని జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. ప్రారంభోత్సవానికి సిద్ధం గా ఉన్న భవనాన్ని పరిశీలించి సూచనలు చేశారు. ఆయన వెంట రూరల్ సిఐ ధనుంజయ రావు, ఎస్ఐ ప్రయోగ మూర్తి వున్నారు.

సత్వరమే వినతుల పరిష్కారం : జెసి

ప్రజాశక్తి -పార్వతీపురం

అర్జీదారులు అందజేసిన వినతులను సత్వరమే పరిష్కరించాలని సంయుక్త కలెక్టర్ ఆర్. గోవిందరావు జిల్లా అధికారులను ఆదేశించారు. పరిష్కారం కాని సమస్యలు ఉంటే ఏ కారణం చేత పరిష్కారం కావో తెలియజేయాలన్నారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు కూడా వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 150 వినతులు అందజేశారు. పింఛన్ల కోసం, కరువు నుంచి రైతులను ఆదుకోవాలని, ఇతర సామాజిక సమస్యలపై ఎక్కువ వినతులు ఉన్నాయి. కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎస్‌పి స్పందనకు ఆరు ఫిర్యాదులు

పార్వతీపురంరూరల్ : స్థానిక జిల్లా పోలీసుకార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన (గ్రీవెన్సు డే) కార్యక్రమానికి ఆరు ఫిర్యాదులు అందాయి. ఎఎస్‌పి డాక్టర్ ఒ.దిలీప్‌కిరణ్ బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలు వారి సమస్యలు స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చునని, వాటిపై చట్టపరిధిలో విచారణ జరిపి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బి సిఐ, సిహెచ్ లక్ష్మణరావు, డిసిఆర్‌బి సిఐ ఎన్‌వి ప్రభాకర్ రావు, ఎస్ఐ పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పందనకు 62 వినతులు

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో స్పందన కార్యక్రమం సోమవారం పిఒ కల్పనకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ స్పందనకు 62 వినతులు వచ్చాయి. వీటిలో కడగండి గ్రామానికి చెందిన మల్లేశ్వరరావు విద్యుత్ స్తంభాలు

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎఎస్‌పి దిలీప్‌కిరణ్

మార్చాలని, జోనగా గ్రామానికి చెందిన కుమారి కుట్టు మిషన్ ఇప్పించాలని, జజ్జువకు చెందిన బాలేసు పవర్ లీడర్ మంజూరు చేయాలని వినతులు ఇచ్చారు. గదవ వలసకు చెందిన రాజకుమార్ మైక్ సెట్ లోన్ ఇప్పించాలని, సంఖిలీకి చెందిన అబ్బాయి సిసి రోడ్డు మంజూరు చేయాలని కోరారు. కన్నపురానికి చెందిన శ్రీనివాసరావు తాగునీటి సమస్య పరిష్కరించాలని, సవర గోయది గ్రామానికి చెందిన రవి పంపు బాయ్ ఉద్యోగం ఇప్పించాలని, ఇరపాడు గ్రామానికి చెందిన జయమ్మ మేకల లోను ఇప్పించాలని కోరారు. చింతపండు తమానుగూడ చెందిన దుర్గారావు కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని, పొంజాడకు చెందిన సుబ్బారావు భాషా వాలంటరీ పోస్ట్ ఇప్పించాలని వినతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ రోషి రెడ్డి, డ్రైవింగ్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింహాచలం, డిడి మంగవేణి, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, డిప్యూటీ డిఇఒ లిల్లీ రాణి, ఎడిఇ భీమరాజు, డిఇ కృష్ణ కుమార్, పిహెచ్ఒ గణేష్, పిఎఒ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులుగా ఎన్నికైన రమేష్, మురళీమోహన్

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా రమేష్, మురళీమోహన్

ప్రజాశక్తి - పార్వతీపురం

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహనరావు తిరిగి ఎన్నికయ్యారు. జిల్లా రెండో కౌన్సిల్ సమావేశం సోమవారం స్థానిక వేదాంత కళాశాలలో సమావేశం జరిగింది. ఈ కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు హాజరైనారు. వీరి సమక్షంలో జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగాఎన్నికైంది. జిల్లా గౌరవాధ్యక్షులుగా ఎ.భాస్కరరావు, అధ్యక్షుగా టి.రమేష్, సహాధ్యక్షులు బి.విజయ్‌కుమార్, వి.జ్యోతి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.మురళీమోహనరావు, రాష్ట్ర కౌన్సిలర్లుగా ఐ.రోజారమణి, పిబి రాయుడు, పి.మధు, ఎస్.రాజకుమారి ఎన్నికయ్యారు. అనంతరం సమావేశంలో పలు భవిష్యత్ కర్తవ్యాలు తీసుకున్నారు. వీటిలో జిఒ 117 రద్దు కోసం సామాజిక ఉద్యమాన్ని నిర్మించాలని, జిపిఎస్‌పై సమరశీల, రాజకీయ పోరాటం చేయాలని, డిఎ, పిఆర్‌సి, పిఎఫ్, జిఎల్ఐసి బకాయిలపై పోరాడాలని, గిరిజన విద్యరంగానికి 117 జిఒ అమలను అంగీకరించరాదంటూ తీర్మానించారు.

గురుకులంలో పిఒ తనిఖీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మల్లి గురుకుల పాఠశాలను ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి నైపుణ్యాన్ని పరిశీలించారు. బాగా చదువుకొని మంచి మార్కులతో పాస్ అవ్వాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ సకాలంలో సిలబస్‌ను పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నుంచి సమాధానాలు రాబడుతున్న పిఒ కల్పనాకుమారి

సమన్వయంతో ఫలితాలు సాధిద్దాం

ప్రజాశక్తి - పార్వతీపురం

వైద్యారోగ్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల్లో మంచి ఫలితాలు సాధిద్దామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు పిలుపునిచ్చారు. వైద్యారోగ్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖల సూపర్ వైజర్ల స్థాయి అధికారులు, సిబ్బందితో సమన్వయ (కన్వర్జెన్స్) సమావేశం స్థానిక గిరిమిత్ర సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. మాతా, శిశు ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణను రెండు శాఖలు సమన్వయంతో పక్కగా నిర్వహించి, పురోగతి సాధించడం ఈ సమావేశం లక్ష్యమన్నారు. ఈ మేరకు త్వరితగతిన గర్భిణులను గుర్తించి రిజిస్ట్రేషన్ చేయడం, హైరిస్క్ గర్భిణులను గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని, రక్తహీనత నివారణ ప్రధాన లక్ష్యమని అందుకు ఐరన్ మాత్రలు, కాల్షియం మాత్రలు నిర్దేశించిన మోతాదులో అందజేయాలని, అదేవిధంగా పౌష్టికాహారం పూర్తి స్థాయిలో వినియోగించాలని అన్నారు. సంక్షేమ పథకాలు (పిఎంఎంవివై, జెఎస్ వై, జెఎస్ఎస్ కె) గర్భిణీ లకు అందేలా చూడాలన్నారు. శిశువులు, పిల్లలకు ఇంటి వద్దనే ఆరోగ్య సంరక్షణ చేపట్టడం, సార్వత్రిక టీకాల కార్యక్రమం, బరువు తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం పై గ్రామాల్లో, క్షేత్ర స్థాయిలో, సమావేశాల్లో పలు శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఐసిడిఎస్ పిడి ఎంఎన్ రాణి, డిఐఒ టి.జగన్మోహన్‌రావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ డి.శివకుమార్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.వినోద్ కుమార్, డిపిహెచ్ఎన్ఒ ఉషారాణి, డిపిఒ లీలారాణి, డెమోలు సన్యాసిరావు, యోగీశ్వరరెడ్డి, సిడిపిఒలు, ఆశా నోడల్ అధికారులు, సిబ్బంది

బస్సు యాత్రను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో ఈనెల 8న నిర్వహించనున్న సామాజిక సాధికారత బస్సు యాత్రను విజయవంతం చేయాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. సోమవారం డిప్యూటీ సిఎం రాజన్నదొర నివాసంలో బస్సుయాత్ర కు సంబంధించిన ఏర్పాట్లపై నియోజకవర్గం లోని నాలుగు మండలాలు, పట్టణ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నిర్వహించనున్న సామాజిక సాధికారత బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 20వేలకు పైబడి జనం సమీకరణ చేయాలన్నారు. ఆటోలు, ట్రాక్టర్లు, మినీ వ్యాన్‌ల్లో కార్యకర్తలు, అభిమానులను తరలించాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు నిర్దేశించిన ప్రదేశాలలో వాహనాలను నిలిపి వేయాలని కోరారు.

అంతా సహకరిస్తేనే పోటీ చేస్తా : డిప్యూటీ సిఎం ఆసక్తికర వ్యాఖ్యలు

అనంతరం డిప్యూటీ రాజన్నదొర మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అందరూ సహకరిస్తామంటే తాను ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని, లేదంటే ఎంపీగా పోటీ చేస్తానని అన్నారు. రెండూ వద్దంటే మానేస్తానని, తన ఆరోగ్యం బాగుండడం లేదని చెప్పారు. పాడేరు, అనకాపల్లి బస్సు యాత్ర లు విజయవంతమయ్యాయని, సాలూరు సభను అంతకంటే ఎక్కువ జనసమీకరణతో విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మక్కువ మండల సీనియర్ నాయకులు మావుడి శ్రీనివాసరావు నాయుడు మాట్లాడుతూ బహిరంగ సభలో డిప్యూటీ సీఎం రాజన్నదొర ఆవిధంగా మాట్లాడి వుండరాదని చెప్పారు. ఆయనకు పోటీ చేయాలని ఆసక్తి లేదని చెబితే పార్టీ కొత్త అభ్యర్థి ని ఎంపిక చేస్తుందని చెప్పారు.కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, పలువురు కౌన్సిలర్లు, ఎంపి చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు,దండి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీతానగరం : పార్వతీపురంలో ఈనెల 10న జరుగు బిసి సామాజిక బస్సు యాత్రను జయప్రదం చేయాలని టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, రాష్ట్ర ఎస్సీ మహిళా కమిషన్ సభ్యులు నవరపు జయమణి కోరారు. ఈ మేరకు సోమవారం సీతానగరం జంక్షన్‌లో ఉన్న రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు అనంతరం జయమణి స్వగృహంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు వివరించి త్వరలో జరగబోయే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని అత్యధికంగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పెదభోగిలి ఉపసర్పంచ్ కె.అరవింద్‌కుమార్, వైసిపి నాయకులు ఎస్ వెంకటరమణ, రామారావు, కొండలరావు పాల్గొన్నారు.

మందుగుండు సామగ్రి స్వాధీనం

ప్రజాశక్తి - కొమరాడ

అక్రమంగా ఇంట్లో నిల్వ ఉన్న దీపావళి మందు గుండు సామగ్రిని ఎస్సై జగదీష్ నాయుడు ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సోమవారం ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మార్కొండపుట్టిలో అక్రమంగా నిల్వ ఉన్న మందు గుండి సామాగ్రిని పట్టుకున్నట్లు తెలిపారు. గ్రామంలో ఒక ఇంట్లో మందు గుండు సామాగ్రి నిల్వ ఉన్నట్లు సమాచారం రావడంతో హెడ్ కానిస్టేబుల్ రాజారత్నం ఆధ్వర్యంలో దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో సుమారు రూ.15వేలు విలువచేసే దీపావళి మందు గుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న మందుగుండు సామాగ్రిని పోలీస్ స్టేషన్‌కు తరలించి నిల్వ ఉంచిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని వెల్లడించారు.

ముందుగుండు సామాగ్రి కొనుగోలు చేసినా జాగ్రత్తగా ఉంచాలి

మండలంలోని ప్రజలు దీపావళి పండుగ సందర్భంగా మందు గుండు సామాగ్రి కొనుగోలు చేసినప్పటికీ సురక్షితమైన ప్రదేశాల్లో నిల్వ ఉంచాలని ఎస్సై తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్లో

మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. మందు గుండు సామాగ్రి మండలంలోని ఇటువంటి అనుమతుల్లేకుండా అమ్మకాలు చేసి, నిల్వ ఉంచిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఎటువంటి లైసెన్సులు లేకుండా మందు గుండు సామాగ్రి అమ్మకాలు చేసే వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. ఈ దాడుల్లో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సద్భావన యాత్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈ నెల 9 నుంచి తానా సంస్థ ఆధ్వర్యంలో చేపట్టబోయే వందేమాతరం శాంతి సద్భావన యాత్ర గోడ పత్రికను స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపల్ టి. వరం మాట్లాడుతూ తెలుగు సాహిత్యం, సంస్కృతిని ప్రపంచ వ్యాప్తంగా చాటి చెబుతూ ప్రజల్లో సామాజిక చైతన్యం తీసుకువచ్చేందుకు శాంతి సద్భావన యాత్ర నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రామయ్య, మన్యం జిల్లా తానా సమన్వయకర్త పాలక దేవానంద్, అధ్యాపకులు డి.శ్రీలక్ష్మి, యన్.శ్రీకాంత్, కె.అశోక్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో మెరుగైన సేవలు : ఎమ్మెల్యే

గుమ్మలక్ష్మీపురం : రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో గ్రామ సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసిందని స్థానిక ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి అన్నారు. జియమ్మ వలస మండలం శిఖబడి, అలమండ గ్రామాల్లో రూ.38.6 లక్షలతో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయాలను, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయాల్లో అన్ని రకాల సేవలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆర్‌బికెల ద్వారా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే సచివాలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జడ్పిటిసి శోభిక, వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

15న బహిరంగ సభను జయప్రదం చేయండి

సీతంపేట: స్థానిక సిపిఎం కార్యాలయంలో చలో విజయవాడ ప్రజా రక్షణ భేరి పోస్టర్లను సోమవారం ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈనెల 15న విజయవాడలో బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ బహిరంగ సభకు ప్రధాన వక్తలు సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు పాల్గొంటారని, ఈ బహిరంగ సభను ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు బి.అప్పారావు, జె.శ్రీరాములు, బి.సాయి, ఎం.లక్ష్మణరావు కె.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాధికార బస్సుయాత్రపై మాట్లాడే అర్హత లేదు

సాలూరు: సామాజిక సాధికార బస్సు యాత్ర పేరుతో ప్రజల్లోకి వచ్చే అర్హత వైసిపికి లేదని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు గుమ్మిడి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ అన్నారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సంధ్యారాణి, భంజ్ దేవ్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగేళ్ల పాలనలో వైసిపి నాయకులు దళిత, గిరిజనులను అడుగడుగునా అవమానించారని విమర్శించారు. కీలకమైన పదవులన్నీ సిఎం జగన్ మోహన్ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారికే కట్టబెట్టారని చెప్పారు. దళిత, గిరిజన ఎమ్మెల్యేలకు పేరుకే పెద్ద పదవులిచ్చినట్లు వైసిపి గొప్పలు చెప్పుకోవడం తప్ప వాస్తవంగా వారికి ఏ విధమైన అధికారాలు లేవన్నారు. దళితులపై దాడులు యధేచ్ఛగా జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నిమ్మది తిరుపతిరావు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కాలువపై పలకలు ఏర్పాటు చేయాలి

కురుపాం: అంగన్వాడీ కేంద్రానికి వెళ్లే చిన్నారులు నడకకు కాలువ వద్ద పలకలు అమర్చాలని మండలంలోని పూతిక వలస గ్రామస్తులు కోరుతున్నారు. గతంలో ఈ అంగన్వాడీ కేంద్రాన్ని తహశీల్దార్ సందర్శించి పిల్లలు కాలువపై నడవడానికి ఇబ్బందికి గురై కాలువలో పడితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించినప్పటికీ ఇప్పటివరకు కాలువపై పలకలు అమర్చలేదని కనీసం చెక్క పలక కూడా లేకుండా ఉండటం వల్ల పిల్లలు కాలువ దాటడానికి ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువపై పలకలు అమర్చి పిల్లలు నడకకు దారి కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆర్‌టిసి సిబ్బందికి వేతనాలు చెల్లించాలి

పార్వతీపురం: పార్వతీపురం డిపోలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందికి సర్క్యులర్ ప్రకారం వేతనాలు చెల్లించాలని ఎపిఎస్ఆర్‌టిసి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కన్వీనర్ వి. తులసీరామ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు కోరారు. పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రవాణాధికారికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సర్క్యులర్ ప్రకారం సిబ్బందికి ఇవ్వాల్సిన జీతాలు కంటే ప్రతి ఒక్కరికీ కాంట్రాక్టర్ రూ. 1800 నుంచి రూ. 2500 వరకూ తగ్గించి ఇస్తున్నారన్నారు. కాల పరిమితి పూర్తయిపోయిన కాంట్రాక్టర్లు సిబ్బందికి ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించకుండా డిపాజిట్లు తీసుకుపోతున్నారన్నారు. బకాయిలు పూర్తిగా చెల్లింపులు జరిగిన తర్వాతే డిపాజిట్లు చెల్లింపు చేయాలని ప్రతి అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బొత్స వెంకటరమణ, బి సూరిబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో వర్షం

గుమ్మలక్ష్మీపురం: చాలా రోజుల తర్వాత గుమ్మలక్ష్మీపురంలో వర్షం కురిసింది. నిన్న మొన్నటి వరకు చుక్క చినుకు కూడా లేకపోవడంతో వరి చేలు పూర్తిగా ఎండిపోయి కరువు ఏర్పడింది. దీంతో రైతులు పూర్తిగా ఆందోళనలో పడ్డారు. అయితే సోమవారం సాయంత్రం కురిసిన వర్షం ఆ కొద్దిపాటి పంటలకైనా మేలు చేస్తుందని రైతులు భావిస్తున్నారు. కొండపోడులో చిరుధాన్యాలకు కొంతమేర ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు.

బిల్లమాడలో గిరిజన సంఘం ప్రాంతీయసభ

సీతంపేట : గిరిజన పేదల సంఘం సభ బిల్లమాడలో సోమవారం నిర్వహించారు. యుసిసిఆర్ఐఎంఎల్ అధ్యక్షులు వై. లక్ష్మీనారాయణ, యు. త్రినాథ్ పాల్గొని కొండ్ర, మంగన్న మరణించిన కారణంగా వారు చేసిన త్యాగాలు ఉద్యమాలు, గిరిజన తెగకు చేసిన త్యాగాలు కోసం వివరించారు. భూస్వామ్య విధానం రద్దు చెయ్యాలని, దున్నేవాడికే భూమి అని కైలాసవెంకటావు సత్యం త్యాగాలు కోసం వివరించారు. ఇందులో గిరిజన పేదల సంఘం అధ్యక్షులు సవర తోటయ్య, ఉపాధ్యక్షులు తెల్లయ్య, 36 గ్రామాలు నుండి 367 మంది సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పాలకొండ: స్థానిక ఆర్‌టిసి డిపోలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎపి ఆర్టీసీ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు తులసీరాం, సిఐటియు జిల్లా అధ్యక్షులు దవాల రమణారావు, డిపో గౌరవ అధ్యక్షులు కె.రాము తదితరులు ప్రజారవాణా అధికారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్క్యులర్ ప్రకారం జీతాలు చెల్లించాలన్నారు. కాలపరిమితి పూర్తయిన వర్కర్లకు బకాయిలు చెల్లించకుండా డిపాజిట్లు తీసుకున్నారన్నారు. ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు.

కరువు మండలాలుగా ప్రకటించాలి

గుమ్మలక్ష్మీపురం: వర్షాభావం వల్ల పంటలు ఎండిపోయి కరువు ఏర్పడుతున్న గిరిజన రైతుల కష్టాలు ప్రభుత్వానికి పట్టడం లేదని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రభుత్వముండే టిడిపి ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కష్టాలు అన్నారు. పచ్చని పంటలతో కళకళలాడాల్సిన గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ మండలాలు కరువు కోరల్లో చిక్కుకున్నాయని తెలిపారు. మరోవైపు మైదాన ప్రాంతంలో వరి చేలు బాగా ఉన్నా అడవి ఏనుగుల గుంపు సంచరించి నాశనం చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారన్నారు. ఏ రకంగా చూసిన రైతులకు కష్టాలు తప్పడం లేదని పేర్కొన్నారు. ఏనుగుల సమస్యను పరిష్కరించాలని ఎన్నోసార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నా కనీసం స్పందించకపోవడం విచారకరమన్నారు. ఇదేనా రైతు సంక్షేమ ప్రభుత్వమని విమర్శించారు. ఏజెన్సీ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

అధ్యాపకులను నియమించాలి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి పివిజి బాలికల జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్, జువాలజీ సబ్జెక్టులను బోధించేందుకు అధ్యాపకులను నియమించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ కోరారు. అధ్యాపకులు లేకపోవడంతో ఆయా సబ్జెక్టులు బోధన జరగని పరిస్థితి ఉందన్నారు. తక్షణమే ఐటిడిఎ అధికారులు స్పందించి అధ్యాపకులను నియమించాలని కోరారు.

నేడు వైసిపి విస్తృతస్థాయి సమావేశం

గరుగుబిల్లి: వైసిపి మండల విస్తృత స్థాయి సమావేశం స్థానిక పిఎసిఎస్ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించనున్నట్టు ఎంపిపి ఉరిటి రామారావు తెలిపారు. ఆంధ్రకు జగన్ ఎందుకు కావాలో చెప్పండి అనే అంశంపై ఈ సమావేశాన్ని నిర్వహించడం జరుగు తుందన్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఈమేరకు మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఎంపిటిసి సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు విధిగా సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

120 లీటర్ల నాటు సారా స్వాధీనం

పార్వతీపురం టౌన్: ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర ఆధ్వర్యంలో సోమవారం ఒడిశా నుండి అక్రమంగా నాటు సారా రవాణా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో పార్వతీపురం మండలం ఆర్కు బట్టివలస వద్ద నిఘా ఉంచి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని 120 లీటర్ల నాటు సారాను సీజ్ చేశారు. అలాగే పార్వతీపురం మున్సిపాలిటీ రెల్లివీధికి చెందిన శ్రీకాంత్‌ను అరెస్టు చేసి, విచారణలో అదే వీధికి చెందిన మరో వ్యక్తి సొండి సురేష్‌పై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎస్ఐ ఎస్ఐ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

తప్పుడు కేసులపై రైతుల ఆగ్రహం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కిసాన్‌మోర్చాపై తప్పుడు కేసులు నమోదు చేయడంపై రైతులు, కార్మికులు నిరసన తెలిపారు. న్యూస్ క్లిక్‌పై పెట్టిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలి వద్ద ఎఫ్ఐఆర్ కాపీలను దగ్ధం చేస్తూ నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర, కోశాధికారి జి.వెంకటరమణ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేక ఉద్యమం 1000 రోజులు పూర్తి చేసుకుందని, ఈ ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమం ప్రజా ఉద్యమంగా అన్ని ప్రజాసంఘాలు చేశాయని అయినా ప్రభుత్వం నిర్ణయం వెనక్కి తీసుకోలేదని, అన్ని రంగాల్లో ప్రైవేటీకరణ విధానాలు ఆపాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం వెంటనే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపుతున్నట్టు ప్రకటన చేయాలని, కార్మిక, రైతు, ప్రజా ఉద్యమాలకు అండగా నిలుస్తున్న న్యూస్‌క్లిక్ వార్త ఛానల్‌పై మోడీ ప్రభుత్వం కక్ష కట్టిందని, ప్రత్యేకించి సంయుక్త కిసాన్ మోర్చా నడిపిన రైతు ఐక్య ఉద్యమానికి మద్దతుగా నిలిచిందన్నారు. జర్నలిస్టులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించి వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు బి.సూరిబాబు, కమిటీ సభ్యులు ఎం.కుమార్ నాయుడు, ఎన్.నాగభూషణం, జి.శ్రీను, జనార్ధన్, విద్యార్థి సంఘం నాయకులు రాజు పాల్గొన్నారు.

బలిజిపేట: ఎఫ్ఐఆర్ కాపీలను దగ్ధం చేస్తున్న నాయకులు

బలిజిపేట : వెయ్యి రోజులు విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేట్‌కరణకు వ్యతిరేక ఉద్యమానికి అభినందనలు తెలుపుతూ, న్యూస్ క్లిక్ పత్రికపై పెట్టిన అక్రమ కేసులు రద్దు చేయాలని ఎఫ్ఐఆర్ కాపీలను స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం దగ్గర దగ్ధం చేస్తూ సిపిఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వంజరాపు సత్యంనాయుడు, కెవిపిఎస్ నాయకులు రాజు, బలరామ నాయుడు, టి.భాను, పాల్గొన్నారు.

శ్రమదానం చేస్తున్న పోలీసులు

పోలీసుల శ్రమదానం

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీ పురం, కురుపాం, గుణుపూర్ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా పెరిగిపోయిన పిచ్చి మొక్కలను ఎల్విన్‌పేట పోలీసులు శ్రమదానం చేసి సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా సిఐ సత్యనారాయణ మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో ఎదురెదురుగా ప్రయాణించే వాహనాలు దగ్గరకు వచ్చేంతవరకు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా యన్నారు. ఈ విషయాన్ని గుర్తించి శ్రమదానంతో పిచ్చి మొక్కలను తొలగించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ షణ్ముఖరావు ఉన్నారు.

ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - పాచిపెంట

స్థానిక వ్యవసాయ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు, డేటా ఎంట్రీ ఆపరేటర్లుకు, సాంకేతిక సహాయకులకు సివిల్ సప్లైస్ ద్వారా ధాన్యం కొనుగోలుపై సోమవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతి రావు మాట్లాడుతూ ధాన్యాన్ని తీసుకువెళ్లే ప్రతి వాహనానికి తప్పనిసరిగా జిపిఎస్ అమర్చాలని, సొంత వాహనాల్లో ధాన్యం తరలించదల్చుకున్న రైతులు తమ వాహనాలకు జిపిఎస్‌లను అమర్చుకొని ముందుగానే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలనుకున్న రైతులంతా ఆర్‌బికెల్లో ముందుగానే రిజిస్ట్రేషన్ చేయించుకొని బయోమెట్రిక్ వేసుకోవాలని తెలిపారు. సివిల్ సప్లై సాంకేతిక శిక్షకులు రాజశేఖర్ ధాన్యం కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలను, నాణ్యత ప్రమాణాలను వివరించారు. అనంతరం సివిల్ సప్లై అసిస్టెంట్ కళ్యాణ్ డేటా ఎంట్రీ ఆపరేటర్లకు, సాంకేతిక శిక్షకులకు ధాన్యాన్ని తరలించేలా వాహనాల రిజిస్ట్రేషన్ రైతులకు ధాన్యం బస్తాల పంపిణీ చేసే విధానాన్ని కంప్యూటర్ ద్వారా వివరించారు. సాంకేతిక శిక్షకులు జి.వనిత ధాన్యం సేకరణ పద్ధతి నాణ్యతా ప్రమాణాలను గుర్తించే విధానం, తేమ యంత్రం ద్వారా ప్రేమ శాతాన్ని కొలిచే విధానాన్ని చూపించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: మాట్లాడుతున్న ప్రశాంతి

సీతానగరం : మండలంలోని పెదబోగిల గ్రామ రైతు భరోసా కేంద్రంలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలకు సంబందించి ఎఒ అధ్యక్షతన గ్రామ వ్యవసాయ సహాయకులకు, టెక్నికల్ అసిస్టెంట్లకు సోమవారం శిక్షణ ఇచ్చారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ టెక్నికల్ అసిస్టెంట్ ప్రశాంతి ధాన్యం కొనుగోలకు సంభందిచిన ప్రక్రియను వివరించారు. సాధారణ రకం ధాన్యం ఒక క్వింటాలకు రూ.2183, గ్రేడ్ - ఏ ధాన్యం రూ.2203లకు కొనుగోలు చేయాలన్నారు. నాణ్యత ప్రమాణాలలో ముఖ్యంగా తేమ శాతం కచ్చితంగా 17శాతం కంటే తక్కువగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలో గల గ్రామ వ్యవసాయ సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మందులు అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి- సీతానగరం

మండలంలోని పెదంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సందర్శించారు. పిహెచ్‌సిలో వ్యాక్సిన్ నిల్వలు, వాటి నిర్వహణ పరిశీలించారు. వ్యాక్సిన్ స్టాక్, వినియోగం ఈవిన్ ఆన్‌లైన్‌లో పరిశీలించారు. ఎప్పటికప్పుడు వ్యాక్సిన్ శీతోష్ణస్థితి, గడువు కాలం విధిగా పరిశీలించాలని ఫార్మసిస్ట్‌ను ఆదేశించారు. ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు, వైద్య పరికరాలు ఆసుపత్రిలో అందుబాటులో ఉంచాల న్నారు. అనంతరం ఒపి రికార్డు పరిశీలించి నమో దవుతున్న వ్యాధులు, అందజేసిన చికిత్స పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం అక్కడ నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. ఐదేళ్లం దరికీ సకాలంలో అందరికీ టీకాలు వేయాలని, ఏదైనా కారణాల వల్ల టీకా వేయబడని పిల్లలను గుర్తిస్తే సత్వరమే టీకా పూర్తి చేయాలన్నారు. ఐరన్ సిరప్ వారానికి రెండుసార్లు వేయించి హెచ్ఐ ఎమ్ఎస్‌లో అప్లోడ్ చేయాలన్నారు. రక్త హీనత, బరువు తక్కువ పిల్లలు, గర్భిణులను గుర్తిస్తే నివారణ చర్యలు త్వరగా చేపట్టాలన్నారు. హై రిస్క్ గర్భిణి చికిత్స కోసం తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను వినియోగించాలన్నారు. మొదటి కాన్పు, ఆడ శిశువు జన్మించిన రెండవ కాన్పుకు ప్రభుత్వం అందజేస్తున్న పిఎమ్ఎమ్‌వివై పథకం త్వరగా చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. జెఎఎస్‌లో గుర్తించిన రిఫరల్స్ పై దృష్టి సారించాలన్నారు. పిహెచ్సిలో సాధారణ కాన్పులు జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒ జి. సూర్యనారాయణ, సూపర్ వైజర్ వరలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందికి సూచనలు చేస్తున్న డిఐఒ జగన్మోహన్‌రావు

ఏజెన్సీలో భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కూరసింగి, ఒప్పంగి గిరిజన గ్రామాల్లో సోమవారం సాయంత్రం టిడిపి నాయకులు భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఇంచార్జి తోయక జగదీశ్వరి మాట్లాడుతూ గిరిజన బతుకులు బాగుపడాలంటే 2024లో టిడిపిని గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క గిరిజనుడిపైనా ఉందన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సురేష్, హరికృష్ణ, రామారావు, బాల, త్రినాథ్ అడ్డాకుల కుసుమమ్మ, మండలం మహిళా కార్యదర్శి జానకి తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని మండ గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ" కార్యక్రమం పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు.

గుమ్మలక్ష్మీపురం: మేనిఫెస్టోను అందిస్తున్న జగదీశ్వరి

టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత చేయబోయే సంక్షేమ పథకాలు గురించి, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు సవర తోట మొఖలింగం, ప్రధాన కార్యదర్శి బిడ్డిక అప్పారావు, సర్పంచ్ బిడ్డిక నీలయ్య, ఐటిడిపి హిమరక పవన్, సవర సూర్యం, సవర బిగ్ బాస్, సవర రాజేష్, సవర సోంహాద్రి, బిడ్డిక భరత్‌రాజ్, మండల నాయకులు పాల్గొన్నారు.

పట్టాల దందాపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

పార్వతీపురంలో నడుస్తున్న బోగస్ ఇళ్ల పట్టాల దందాపై చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు వి.దాలినాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావును కలిసి పార్వతీపురం లో జరుగుతున్న బోగస్ రెవెన్యూ ఇళ్ల పట్టాల దందాపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలి టీలోని లక్ష్మీనాయుడు చెరువు, దేవుడిబంద, నెల్లిచెరువు, కోదు వానిబంద, గిజబకాలనీ, వైకెయం కాలనీ, వివేకానంద కాలనీ, కొత్తవలస జి లేఅవు ట్ తదితర ప్రాంతాల్లో బోగస్ పట్టాలతో కొంతమంది అక్రమ నిర్మాణాలు చేపడు తున్నారన్నారు. ఈ పట్టాలు దాదాపుగా రెవెన్యూ ఇళ్ల పట్టాలను పోలి ఉన్నాయన్నారు. ఈ పట్టాల జారీ వెనుక రెవెన్యూ అధికారుల సిబ్బంది హస్తం ఉందన్నారు. ఒకవేళ బోగస్ ఇళ్ల పట్టాల దందాలో రెవెన్యూ ఉద్యోగుల ప్రమేయం లేకపోతే చెరువుల్లో, ప్రభుత్వ స్థలాల్లో పట్టపగలు పక్కాగా పక్కా భవనాలు నిర్మాణాలు చేస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తక్షణమే ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న నిర్మాణదారుల వద్ద ఉన్న ఇళ్ల పట్టాలపై దర్యాప్తు నిర్వహించి బోగస్ పట్టాలపై పోలీస్ కేసులు నమోదు చేయాలన్నారు. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ చెరువులు, స్థలాలను బోగస్ పట్టాలతో లక్షల రూపాయలకు అమ్మకాలు చేస్తున్న ఈ దందా నడిపే వ్యక్తులు బయటపడే అవకాశం ఉందన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

సమాధానాలను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ లావణ్య

పాఠశాల సందర్శన

పాలకొండ: విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరాలని ఆర్‌డిఒ ఎం.లావణ్య అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చిన్న మంగళాపురం జెడ్‌పి హైస్కూల్‌ను దత్తత తీసుకొని సోమవారం ఆ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడుతూ ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించాలన్నారు. పాఠశాలలో ఎటువంటి సమస్యలు ఉన్న పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు.

విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయండి

ప్రజాశక్తి - సీతానగరం

ఈనెల 8న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రాజు కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గోడపత్రిక సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, టెలికాం తదితర రంగాలను ప్రైవేటీకరణ చేస్తున్నాయని, దీని ఫలితంగా నిరుద్యోగ సమస్య పెరుగుతుందని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులు కదిలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజేష్, సత్యనారాయణ పాల్గొన్నారు. **కురుపాం :** విశాఖ ఉక్కు పరిరక్షణకై, కడప ఉక్కు కర్మాగారం నిర్మాణం చేయాలని కోరుతూ కేజీ టు పీజీ వరకు ఈనెల 8న రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాలు చేపట్టే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ సంఘాల నాయకులు కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి, అధ్యక్షులు కె.అన్నాజీ, ఎస్.గౌతమ్, కిషోర్, ప్రవీణ్, అర్జున్, సందీప్, పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: విశాఖ ఉక్కు పరిరక్షణ, కడప ఉక్కు కర్మాగారం నిర్మాణం చేయాలని కోరుతూ కేజీ టు పీజీ వరకు నవంబర్ 8న రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి యువజన సంఘాలు చేపట్టే విద్యా సంస్థల బందును జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక పోస్ట్ మెట్రిక్ బాయ్స్ హాస్టల్లో గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు ఎ.గంగారావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పోరాటానికి నవంబర్ 8తో 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా విద్యార్థి యువజన సంఘాలు బంద్ చేపడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు ఎ.సురేష్, బి.అనిల్ తదితరులు ఉన్నారు.

ఐటిడిఎ లావాదేవీలపై దర్యాప్తు చేపట్టాలి

ప్రజాశక్తి -పార్వతీపురం

వెలుగు ఎపిడి వై.సత్యంనాయుడు పనిచేసిన కాలంలో ఐటిడిఎలో జరిగిన లావాదేవీలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టాలని గ్రీవెన్స్‌లో ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్‌కు సిపిఎం నాయకులు కె.సాంబమూర్తి, తెలుగుయువత మండల అధ్యక్షులు ఎన్.శ్రీనివాసరావు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గల కురుపాం, గుమ్మలక్ష్మీపురం, మక్కువ, సాలూరు, పార్వతీపురం, పాచిపెంట, జియ్యమ్మవలస, కొమరాడ మండలాల్లో వన్ దన్ వికాస్ కేంద్రాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.3.20కోట్లు ఎన్ని కేంద్రాలకు ఇచ్చారన్నారు. మిగతావి ఏమయ్యాయి, సుమారు ఎంత ఖర్చు పెట్టారు, ఇంకా ఎంత ఖర్చు పెట్టలేదనే వివరాలు, ఖర్చుపెట్టని డబ్బులు ఏమయ్యాయి అన్న విషయంపై దర్యాప్తు చేపట్టాలని కోరామన్నారు. మినప గుళ్ళు, అగర్బత్తి ఏ మండలాల్లో ఎన్ని వన్‌దన్ వికాస్ కేంద్రాలకు పంపిణీ చేశారని ప్రశ్నించారు. జీడి పిక్కలు ప్రాసెసింగ్ మిషన్లు సుమారు 13 వరకు కొనుగోలు చేసినట్లు తెలిసిందని, అయితే వాటివల్ల ఎలాంటి ప్రయోజనం లేకుండా కార్యాలయాలకు పరిమితమయ్యాయని చెప్పారు. వీటిన్నింటిపై దర్యాప్తు చేపట్టాలన్నారు.

పిఒకు వినతినిస్తున్న కొల్లి సాంబమూర్తి

దాడులకు నిరసనగా అంబేద్కర్ విగ్రహానికి వినతి

ప్రజాశక్తి - సీతంపేట

రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ సీతంపేటలో గల అంబేద్కర్ విగ్రహానికి పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ సోమవారం వినతిపత్రం అందించారు. తొలుత అంబేద్కర్, అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనలో దళితులపై దాడులు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. జగన్ పాలనలో దళితులపై జరిగినన్ని దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు ఎన్నడూ జరగలేదన్నారు. కంచికచర్లలో జరిగిన అమానుష దాడిలో ఎ-1 ముద్దాయి హర్షవర్ధన్‌రెడ్డి దళిత యువకుడు శ్యాంపై దాడి చేసి మూత్రం పోసి తాగమనడం నీచం, దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో రెడ్డి సామాజిక వర్గం దళితులపై రెచ్చిపోయి దాడులు చేస్తున్నారన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ రాష్ట్రంలో నాలుగున్నరేళ్లలో దళితులపై 6 వేలకు పైగా దాడులు జరిగాయన్నారు. వీటిని ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు సవరతోట మొఖలింగం, మండల ప్రధాన కార్యదర్శి బిడ్డిక అప్పారావు, సర్పంచ్ బిడ్డిక నీలయ్య, ఐటిడిపి కో-ఆర్డినేటర్ హిమారక పవన్, మండల నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆ సంఘం వ్యవస్థాపకులు సామల సింహాచలం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా సామల సింహాచలం (పార్వతీపురం మన్యం), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మేకల శివార్జున (కడప), అధ్యక్షులుగా కె.రామమూర్తి (తిరుపతి), ప్రధాన కార్యదర్శిగా బోనెల రమేష్ (శ్రీకాకుళం), కోశాధికారిగా పల్లా బాబ్జీ (అనకాపల్లి), ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా అనుకుల జాన్, రాష్ట్ర సహాధ్యక్షులుగా బి.జానకీరావు, ఉపాధ్యక్షులుగా బి.యమున, కె.త్రినాథరావు, సాగర్, రామారావు, దామోదరం, సుదర్శన రావు, శేషగిరిరావు, పెంచలయ్య, బి.సత్యనారాయణ, కార్యదర్శులుగా ఎస్.కౌసల్య, విజయరాజ్, మనోజ్, కిరణ్ కుమార్, వినోద్ కుమార్, జి.వెంకట నారాయణ, భల్యా నాయక్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఇంటెరిం రిలీఫ్ (ఐ.ఆర్)ని తక్షణమే ప్రకటించాలని, డిఎ బకాయిలు చెల్లించాలని సమావేశంలో తీర్మానాలు ఆమోదించారు.

హామీలన్నీ అమలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నాటి ప్రజా సంకల్ప యాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చారని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. వైఎస్ జగన్ ప్రజా సంకల్ప పాదయాత్ర ప్రారంభించి ఈనెల 6నాటికి ఆరేళ్ళు పూర్తవుతున్న సందర్భంగా ఎమ్మెల్యే ఆధ్వర్యాన పార్టీ శ్రేణులతో కలిసి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. నాడు జగన్ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత 99 శాతం మేర నెరవేర్చామన్నారు. ఈ ప్రభుత్వంలో మీకు లబ్ధి చేకూరినట్టు అనిపిస్తేనే రానున్న ఎన్నికల్లో జగన్‌ను మళ్లీ గెలిపించుకునేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ యిండుపూర్ గుణేశ్వరరావు, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, ఎంపిపి మజ్జి శోభరాణి, పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, వైస్ ఎంపిపిలు బి రవి కుమార్, సిద్ధ జగన్నాధ రావు, జెడ్‌పిటిసి ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, జెసిఎస్ కన్వీనర్లు బి.వాసుదేవరావు, గొర్లి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే మెరుగైన పాలన జరుగుతుందని శాసన మండలి విప్ పాలవలస విక్రాంత్ అన్నారు. ప్రజాసంకల్పయాత్ర ప్రారంభమై ఆరేళ్ళు పూర్తన సందర్భంగా సోమవారం స్థానిక కార్గిల్ పాయింట్ దగ్గర వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందన్నారు. ఎమ్మెలే వి.కళావతి మాట్లాడుతూ అన్ని వర్గాలకు అండగా ఈ ప్రభుత్వం ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు కనపాక సూర్య ప్రకాష్, అనిల్, నగర పంచాయతీ వైస్ చైర్మన్ పల్లా ప్రతాప్, వీరఘట్టం ఎంపిపి దమలపాటి వెంకటరమణ, వెలమల మన్మధరావు, పాలవలస ధవళేశ్వరరావు పాల్గొన్నారు.

భామిని : సిఎం చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర ఆరేళ్ళు పూర్తయిన సందర్భంగా భామినిలోని కొరమ కూడలి వద్ద గల వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద వైసిపి ప్రజా ప్రతినిధులు కేక్ కట్ చేసి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, జెసిఎస్ కో ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, జెడ్‌పిటిసి బొడ్డేపల్లి ప్రసాదరావు, నాయకులు ఎ.రఘుపతి నాయుడు, పాల్గొన్నారు.

సాలూరు: సిఎం జగన్ మోహన్ రెడ్డి గత ఎన్నికల ముందు చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర వైసిపి చరిత్రలో ఓ మైలురాయి లాంటిదని మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, పట్టణ పార్టీ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరి, రఘు అన్నారు. ప్రజా సంకల్పయాత్ర ప్రారంభించి ఆరు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం పట్టణంలోని బోసుబొమ్మ జంక్షన్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి నాయకులు కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, కౌన్సిలర్‌లు రాపాక మాధవరావు, గొర్లి వెంకటరమణ, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ, మాజీ కౌన్సిలర్ కె.వెంకటరమణ పాల్గొన్నారు. **కురుపాం :** స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద ఎంపిపి శెట్టి పద్మావతి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. నాలుగున్నరళ్ళ పాలనలో అందించిన సంక్షేమ పథకాలు, పరిపాలనను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి జి.సుజాత, సర్పంచ్ జి.సుజాత, ఎంపిటిసిలు బంగారు నాయుడు, స్వామి యాజులు, సంతోషి పాల్గొన్నారు

పార్వతీపురం: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

IN THE HONOURABLE COURT OF THE Ist ADDL. JUNIOR CIVIL JUDGE CUM JUDICIAL MEGISTRATE AT :: VIZIANAGARAM

I.A.NO: 609 / 2023 in O.S.No: 425/2012

Between:
Kapil Chit Funds Private Limited, Represented by its Asst. Manager, Vizianagaram.
... Plaintiff/Petitioner
And
Tattikota Tirumala Rao & others
... Defendant / Respondent

To:
D1: Tattikota Tirumala Rao, S/o Venkata Rao, Aged 29 Years, Tattikotavari Street, Salur, Manyam District.

Please take Notice That The above named Plaintiff Filed the above Suit against you, and the matter coming for your appearance and stands posted to 16-11-2023, on that day your personally or through advocate attend before the Honorable Court at about 10.30 AM filing which the Hon'ble court decided under the court of Law.

Sri. D.RAMA RAO,
Advocate,